# జీవితం

శ్రీ. పి. శేషగిరిరావు

ఒక్కసంసారానికైతే సరిపోను సంపాదనడబ్బు...అన్నయ్య ఆటపాటలగ్గూడా ఈ ధనమే—ఎంతవరకువీలైతే అంతవరకు ఆటపాటలు అణిచిపెట్టాల్సినదినాలు...అందులో అంతం తెలియని ఈయుద్ధాన్నిచూస్తే ప్రాణాలు అలమటిస్తాయి.

అయినా పెళ్ళయినవాడికంత మోజు ఏమిటో! అర్ధరాత్రివేళ ఆ ఏరు ఈది చలిలో వెళ్ళేవాడు. ఏరుచలిలో ఈదే అంత అవసరం నాకేం తెలుస్తుంది పెళ్ళికానివాడికి...'ఆమె ఆనందాన్నిస్తుంది' అనేవాడు.

ఆమెకు సొమ్ములపరంగా అయితేనేం ఆస్తిపరంగా నైతేనేం అప్పుడప్పుడిచ్చిన మొత్తాలైతేనేం ఆమెకు డబ్బు చాలాముట్టింది....ఎక్కడిదీడబ్బు? ఉద్యోగం సద్యోగం లేనివాడికి డబ్బెక్కడిది? నానాకూళ్ళు కుడిచి, దొంగకూడుకు చెయ్యిజాచిన నాసంపాదనేగా వీడికి అడ్డంకిగా తగుల్తున్నది.

చేసుకున్నపెళ్ళాంఇంట్లోవుండగా వీడికెందుకో ఈదుర్బుద్ధి...చెప్పేదెవరు ఇటువంటి వాళ్లకు, ప్రొద్దుగూకకముందే భోజనం కానిచ్చి నాకోసం ఎదురుచూస్తాడు. ఈ విధంగా చాలాకాలం గడిపాడు—కొన్నిదినాలు వచ్చేవాడుకాదు—మరి ఆ కృష్ణవేణమ్మ తరఫున మగపురుగనేవాడు లేడేమో!

ఆనాడు సంధిపుట్టి, అడుగో 'వస్తున్నాడు' అని పిచ్చిగా మావదిన అరిచేది—నిజంగా వస్తాడనిపించింది—ఆదినమే సాయంకాలానికి ఆకాస్త ప్రాణం ఆఖరైంది...

వాడికి తెలియపర్చాను ఈసంగతి...వాడేంపట్టించుకోలా— నేను స్వయంగా వెళ్లి ఎన్నోవిధాల బ్రతిమాలి భంగపడ్డాను. లాభంలేకపోయింది మొదట- తర్వాత' సరే' నని బయలుదేరి ఒకసారి వచ్చి సాయంకాలానికి తిరిగి వెళ్ళాడు—

ఈ ప్లీడర్లు గుమాస్తాపని వచ్చాక బీడీలు జాస్తిఅయినాయి—దాంతో నాకు దగ్గు సంప్రాప్తమైంది—నాకు దగ్గుతో జబ్బు బలమైంది...వాడికి చాలా కబుర్లుచేశాను రమ్మని—సమాధానంలేదు—తనకు చేసిన ఉపకారానికి ప్రతిఫలం !!

నాకు వ్యాధి నిమ్మళించుకు వస్తున్నది—వాడు వకరోజు తెల్లవారేసరికి వచ్చాడు. వాడిపనుల్లోవున్నాడు వచ్చినప్పట్నించి...సాయంకాలానికివెళ్లేప్రయత్నాలు చేసుకుంటున్నాడు...ప్రపంచంలో ఇక వ్యభిచారమే 'మానవుని ప్రధమకర్తవ్యం అనికామాలి మావాడిసిద్ధాంతం- వెళ్తూ,సాయంకాలం ఏటిదగ్గర ఏదో పిచ్చాపాటి కబుర్లు మాట్లాడాడు—నేను అనేకవిధాల వాడిబాగోగులను గురించి చెప్పాను...వినేట్టు కనబడలా—పైగా ఓ గుట్టు చెప్పాడు—రోగాలున్నయని ... ఇప్పటికి తెలిసింది గామాలు తనకు...వెళిపోయాడు.

వారందినాలు అయ్యేసరికి వచ్చాడు- చాలా శుష్కించివున్నాడు—నాకే దిగులేసింది...వళ్లు పచ్చిపుండయి ఇంట్లోపడ్డాడు. అమితజబ్బులో వున్నాడు. డాక్టరుకూ నయమయ్యేటట్టు లేదు వ్యాధి—'ఎన్ని జబ్బులున్నాయో!' అన్నాడు డాక్టరు పున్నారావు. ఆరాత్రిగడవటమే ఎలాగో అనుకున్నాం—

తెల్లవారి చూసేసరికి మన ప్రపంచంలో లేడు...తన కృష్ణవేణమ్మకు అంతులేని దూరమైపోయాడు...